హన్సిని
# టుడే
http://www.todaytelugudaily.in | తెలుగు దినపత్రిక

బెట్టింగ్ ఊబిలో యువత :
ఐపీఎస్ సజ్జనార్...



2

హన్సిని టుడే తెలుగు దినపత్రిక
ఈ-పేపర్ www.todaytelugudaily.in
ఈ-పేపర్ www.todaytelugudaily.in

విలేకరులు కావలెను

పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం, మీప్రాంత స్థితిగతులపై అవగాహన, చక్కని తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న ఔత్సాహిక యువకులకు ఇదేమా ఆహ్వానం.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విలేకరిగా పనిచేసేందుకు డిగ్రీ చదివిన 30 ఏండ్లలోపు స్థానిక యువకులు కావాలి. ఆసక్తి ఉన్నవారు సంప్రదించగలరు.

సంప్రదించండి : 8688462524 | 9951034564

• తెలంగాణ | సంపుటి: 10 సంచిక: 71 | బుధవారం,మార్చి19,2025 | పేజీలు : 4 | వెల : 4

### నేడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న
# మల్లు భట్టి విక్రమార్క..

- ఉదయం గం.11.14 నిమిషాలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న భట్టి
- రూ. 3.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం
- మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,మార్చి18, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రేపు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఉదయం 11.14 గంటలకు శాసనసభలో భట్టి విక్రమార్క, శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.బుధవారం ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశం జరగనుంది. బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్. సుమారు రూ.3.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశముంది.

### ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ
# శాసనసభ ఆమోదం

**59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజన...**

- ఆయా గ్రూపులకు వేర్వేరు రిజర్వేషన్లు కల్పించేలా బిల్లు
- దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోంది
- ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చింది
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,మార్చి18 తెలంగాణ శాసనసభ ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించింది. 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తూ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. గ్రూపు-1లోని అత్యంత వెనుకబడిన 15 కులాలకు 1 శాతం రిజర్వేషన్, మాదిగలు ఉన్న గ్రూప్-2లోని కులాలకు 9 శాతం రిజర్వేషన్, మాలలు ఉన్న గ్రూప్-3లోని కులాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును రూపొందించారు.ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని అన్నారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలను అప్పగించి గౌరవించిందని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రిగా చేసిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగిందని తెలిపారు.దశాబ్దాల పోరాటంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, ఇన్నాళ్లకు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ సమస్య పరిష్కారం కావడం ఆనందంగా ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించామని ఆయన గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని తెలిపారు. కమిషన్ నివేదికను మార్చకుండా ఆమోదించామని వెల్లడించారు.

# మహా కుంభమేళాపై మోదీ
# మాటలకు నేను మద్దతిస్తాను...



**కుంభమేళా తొక్కిసలాటలో మృతి చెందిన వారికి మోదీ నివాళులర్పించలేదు**

- సభలో ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశమివ్వాలన్న రాహుల్ గాంధీ
- విపక్షాలు తమ గళాన్ని వినిపించేందుకు తగిన అవకాశాలు ఇవ్వడం లేదని విమర్శ
- సభలో ప్రధానమంత్రి లేదా మంత్రులు మాట్లాడుతున్నప్పుడు ఇతరులు మాట్లాడేందుకు అనుమతి ఉండదు
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,మార్చి18,( మహా కుంభమేళా భారత సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రలను ప్రతిబింబించిందంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలకు తాను మద్దతు తెలుపుతున్నానని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అయితే, కుంభమేళా తొక్కిసలాటలో మృతి చెందినవారికి ప్రధాని మోదీ నివాళులర్పించలేదని ఆయన విమర్శించారు.కుంభమేళాకు వెళ్లిన యువత దేశ ప్రధానమంత్రి నోట మరో మాట కూడా వినాలని భావించారని, వారికి ఉద్యోగాలు కావాలని ఆయన పేర్కొన్నారు. ప్రధాన మంత్రి తర్వాత లోక్ సభలో ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని రాహుల్ గాంధీ అన్నారు. విపక్షాలు తమ గళాన్ని వినిపించేందుకు తగిన అవకాశాలు ఇవ్వడం లేదని ఆయన అన్నారు.రాహుల్ గాంధీ విమర్శలపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ స్పందించారు. సభలో ప్రధానమంత్రి లేదా మంత్రులు మాట్లాడుతున్నప్పుడు ఇతరులు మాట్లాడేందుకు అనుమతి ఉండదని, ఇదే విషయాన్ని రాహుల్ గాంధీకి చెప్పామని అన్నారు. కానీ మీడియా ముందుకు వచ్చి ఇలాంటి ప్రకటనలు చేయడం విడ్డూరమని ఆయన అన్నారు. రాహుల్ గాంధీకి నిబంధనలు అర్థం కాలేదని ఆయన విమర్శించారు.

# మంత్రి ఉత్తమ్ సూర్యాపేటకు ఎస్ఆర్ఎస్పీ నీళ్లు తీసుకురావాలి

- మంత్రి అలా చేస్తే ఆయన కాళ్లు కడిగి ఆ నీళ్లు తన నెత్తిన పోసుకుంటాననని ప్రకటన
- పరిపాలన చేతగాక కాంగ్రెస్ వాళ్లు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఫైర్
- ఆయన కాళ్లు కడిగి ఆ నీళ్లు నా నెత్తిన చల్లుకుంటా: జగదీశ్ రెడ్డి




హైదరాబాద్,మార్చి18, బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సూర్యాపేటలో పంటలు ఎండిపోతున్నాయని, ఎండిపోయిన పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ. 30వేలు పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా మాట్లాడుతూ, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేటకు ఎస్ఆర్ఎస్పీ దేవాదుల ప్రాజెక్ట్ నీళ్లు తీసుకొస్తే ఆయన కాళ్లు కడిగి ఆ నీళ్లు తన నెత్తిన చల్లుకుంటానని అన్నారు. ప్రభుత్వం, మంత్రులు చేతగాని మాటలు మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి విమర్శించారు. పరిపాలన చేతగాక వ్యక్తిగతంగా దుర్భాషలాడుతున్నారని ఆయన ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక అన్ని వర్గాల వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు. ఎందుకంటే కాంగ్రెస్ సర్కార్‌పై రైతులు, నిరుద్యోగులు, మహిళలు ఇలా అందరూ అసహనంతో ఉన్నారన్నారు. కాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు ఆయనపై సస్పెన్షన్ ఉంటుంది.

# ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై అట్రాసిటీ కేసు



బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్‌కు, కార్పొరేటర్‌కు హనీమూన్ నడుస్తుందని ఆయన చేసిన వ్యాఖ్యలే కేసుకు కారణం.బీఆర్ఎస్ నేత, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తనపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత ఎల్‌బీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుధీర్ రెడ్డిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

- హైడ్రా పేరిట ప్రభుత్వంలోని పెద్దలు వసూళ్ల దందా నడిపిస్తున్నారన్న కేటీఆర్
- మూసీ పేరుతో పేదల ఇళ్లపై పగబట్టారని ఆరోపణ
- ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి మండిపాటు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

# 'హైడ్రా' పేరుతో వసూళ్ల దందా..

హైదరాబాద్,మార్చి18, హైడ్రా పేరుతో ప్రభుత్వంలోని పెద్దలు వసూళ్ల దందా నడిపిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మూసీ పేరుతో పేదల ఇళ్లపై పగబట్టారని ఆరోపించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరును విమర్శిస్తూ పోస్టు పెట్టారు. ఫోర్త్ సిటీ పేరుతో ముఖ్యమంత్రి ఫ్యామిలీ రియల్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి దుయ్యబట్టారు. ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. పేదలపై ప్రతాపం చూపిస్తూ పెద్దలతో ఒప్పందం చేసుకుంటారని విమర్శించారు. ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి, ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుభరోసా రాదు.. రుణమాఫీ కాదన్నారు. అలాగే పంటలు కొనుగోలు చేయరని కేటీఆర్ విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను 15 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాన్ని పాతాళానికి తీసుకెళ్లారని మండిపడ్డారు. ఇది పాలన కాదు పీడన అని అన్నారు. అలాగే ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ అని విమర్శించారు. ఇప్పటికైనా



ప్రజలు మేల్కోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.




# ప్రజా సంక్షేమమే బడ్జెట్ లక్ష్యం కావాలి,!

- విద్యకు 20 శాతం,వైద్యానికి పది శాతం నిధులను ప్రతిపాదించాలి
- రేషన్ కార్డుదారులకు 14 రకాల సరుకులు ఇవ్వాలి
- గృహ వినియోగదారులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలి
- ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.పది లక్షలు,రాష్ట్రం రూ.ఐదు లక్షలివ్వాలి
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- గ్యారంటీల అమలుకు నిర్దిష్ట కేటాయింపులుండాలి
- శ్రామికులు,అణగారిన వర్గాలకు ప్రాధాన్యత ఉండాలి
- బీఆర్ఎస్ అప్పులు చేసిందంటూ తప్పించుకోవడం సరికాదు
- హామీలు నెరవేర్చకపోతే పోరాటాలు తప్పవు
- బీజేపీ విధానాలు, మతోన్మాదాన్ని కాంగ్రెస్,బీఆర్ఎస్ వ్యతిరేకించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్ :మార్చి18( టుడే ప్రతినిధి వైవి). 'రాష్ట్ర బడ్జెట్ 2025-26లో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల అమలు కోసం నిర్దిష్టమైన కేటాయింపులుండాలి. శ్రామికులు,అణగారిన వర్గాల ప్రయోజనాలు,వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వాలి.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించాలి.ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందంటూ గత ప్రభుత్వం పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవాలని చూడటం సరైంది కాదు.ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉన్నది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి.బడ్జెట్‌ను సవరించి రాష్ట్రానికి నిధులు వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి.'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.ఆ వివరాలు ఆయన మాటల్లోనే%ో%'అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి.రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా సభలో చర్చ జరగాలి.బడ్జెట్‌లో ప్రజల సంక్షేమం,రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలి.విద్యా వైద్యం, ఉపాధి అవకాశాలను పెంచే పద్ధతిలో ప్రతిపాదనలుండాలి.కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది.రావాల్సిన నిధుల్లో కోత విధించింది.రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదు.బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ,కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి అనుమతి ఇవ్వలేదు.విభజన హామీల అమలుకు సంబంధించిన నిధులను కేటాయించలేదు.కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన నిధులను కేటాయించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి.కేంద్రంపై అన్ని పార్టీలూ ఒత్తిడి తేవాలి.రాష్ట్రానికి రావాల్సిన నిధులపై నిర్దిష్టమైన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ దృష్టికి తేవాలి.అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలి.సమస్యలు చర్చకు వస్తే వాటిని ప్రభుత్వం పరిష్కరిస్తే ప్రజలకు మేలు కలుగుతుంది.'ప్రజలను మభ్యపెట్టడం తగదు'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తయ్యింది.ఖజానా ఖాళీ అయ్యిందనీ,బీఆర్ఎస్ రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసిందని అధికార పార్టీ నాయకులు చెప్తున్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలిచ్చింది.రాష్ట్రంలో ఆదాయం,అప్పుల గురించి ముందే తెలుసు.తెలిసే కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోను ప్రకటించింది.ప్రజలను మభ్యపెట్టడానికి మోసం చేయడానికి గత ప్రభుత్వం మీద నెపం నెట్టడం




సరైంది కాదు.గ్యారంటీల అమలు కోసం 2024-25 బడ్జెట్‌లో నిర్దిష్టమైన కేటాయింపులు చేయలేదు.2025-26 బడ్జెట్‌లోనైనా హామీల అమలుకు నిర్దిష్టమైన ప్రతిపాదనలుండాలి.'ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ఉండాలి'శ్రామిక వర్గాల ప్రజలు,అణగారిన వర్గాల ప్రయోజనాల కోసం బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి.ఈ పదేండ్లలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లను చూస్తే కార్పొరేట్ సంస్థలు,పెట్టుబడిదారులు, దోపిడీదారులకు అనుకూలంగా ఉన్నాయి.ఈ బడ్జెట్‌లోనైనా ఇచ్చిన హామీల అమలు కోసం ప్రతిపాదనలుండాలి.లేదంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలు,సంక్షేమం కోసం శ్రామికుల హక్కుల కోసం ఉద్యమిస్తాం.ఈనెల చివరి వరకు ప్రజా సమస్యలపై సర్వే చేస్తున్నాం.ఇండ్ల స్థలాలు,కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,ఎస్సీ,ఎస్టీ,బీసీ వాడలు,ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆస్పత్రులు,సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిశీలిస్తున్నాం.

అధ్యయనం చేసి ఆందోళనా పోరాటాలకు పూనుకుంటాం.పాలక పార్టీలు ప్రతిపక్షంగా ఉన్నపుడు ఒకమాట,అధికారంలోకి వచ్చాక ఇంకోమాట చెప్తున్నాయి.ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాయి.అందరికీ విద్యావైద్యం ఉచితంగా అందాలి. ఉపాధి అవకాశాలు పెరగాలి.నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి.ప్రభుత్వాల తీరు మారాలి.అసమానతలను తగ్గించాలి.అందరికీ సంపద పంపిణీ జరగాలి.ఆ దిశగా బడ్జెట్‌కు రూపకల్పన జరగాలి'

## రేషన్‌కార్డులకు సరిపడా సరుకులివ్వాలి...

'రాష్ట్రంలో 85 లక్షల రేషన్ కార్డులున్నాయి.కేంద్రం సగం మాత్రమే గుర్తించింది.బియ్యం తప్ప మిగతా వస్తువులను ఇవ్వడం లేదు.బియ్యంతో పాటు పప్పు,మంచినూనె,సబ్బులు, కిరసనాయిల్,ఇతర వస్తువులు ఇవ్వాలి.నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి.పౌష్టికాహారం అందక అనారోగ్యం పాలవుతున్నారు.పిల్లలు బరువు తగ్గి బాధ పడుతున్నారు.రక్తహీనతతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.దీన్ని నివారించాలంటే బియ్యంతో పాటు రేషన్‌కార్డులకు 14 రకాల సరుకులను అందించాలి. అందుకోసం నిధులను కేటాయించాలి.రాష్ట్రంలో అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులను ఇవ్వాలి.

## బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి...

'పట్టణాల్లో ఎనిమిది శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 20 శాతం నిరుద్యోగం ఉన్నట్టు నివేదికలు చెప్తున్నాయి.మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పింది.నిరుద్యోగులకు రూ.నాలుగు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించింది.ఇప్పటి వరకు 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రభుత్వం చెప్పింది.మిగిలిన 1.45 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలి.నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు కోసం చర్యలు తీసుకోవాలి.రాష్ట్రంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుపై సర్వే చేస్తున్నాం.ఇది సక్రమంగా అమలు కావడం లేదు.గృహ వినియోగదారులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించాలి.'రుణమాఫీలో వాస్తవాలేంటి?'రైతు రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నది.ఇంకా రూ.పది వేల కోట్ల రుణాలు మాఫీ చేయలేదు.రాష్ట్రంలో 30 లక్షల మంది ఇండ్లు లేని వారున్నారు.ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు,ఎస్సీ,ఎస్టీలకు రూ.ఆరు లక్షలు ఇస్తామని ప్రకటించింది.30 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షల చొప్పున కేటాయించినా రూ.1.50 లక్షల కోట్లు అవసరమవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇండ్ల చొప్పున 4.50 లక్షల ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించింది.దానికోసం రూ.22,500 కోట్లు కావాలి.ఈ నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించి విడుదల చేయాలి.మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు.ఇంకా అమలుకు నోచుకోలేదు.గత ప్రభుత్వం చేసిన అప్పులు,వడ్డీల పేరు చెప్పి కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు నుంచి తప్పించుకోవడం సమంజసం కాదు.గత ప్రభుత్వం సరిగ్గా పనిచేయలేదు కాబట్టే కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారు.వికలాంగులకు రూ.నాలుగు వేల నుంచి రూ.ఆరు వేలకు పెన్షన్ పెంచుతామన్నారు.ఆ ఊసేలేదు.ఆసరా పెన్షన్లు రూ.నాలుగు వేలకు పెంచుతామన్నారు.తక్షణమే పెంచాలి.వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్నారు.ఇప్పటి వరకు బడ్జెట్ లేదు.ఎంత మంది ఉన్నారో స్పష్టత లేదు.తప్పుడు లెక్కలు చెప్తున్నారు.రాష్ట్రంలో వ్యవసాయ కూలీలు 40 లక్షల మంది ఉన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 5,79,452 మంది ఉన్నారని గుర్తించింది.దీనికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అని పేరు పెట్టింది.40 లక్షల మందికి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలంటే రూ.4,800 కోట్లు కావాలి.ప్రస్తుత బడ్జెట్‌లో రూ.50 కోట్లు మాత్రమే కేటాయించింది.వ్యవసాయ కార్మికుల సంఖ్యను తగ్గించింది.వ్యవసాయ కూలీలు,ఉపాధి హామీ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి. ఎస్సీ,ఎస్టీలకు అరకొర నిధులను కేటాయించింది.అవి కూడా ఖర్చు చేయడం లేదు.ఖర్చు చేసినా నిధులను దారిమళ్లిస్తున్నారు.ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రకారం రూ.33,124 కోట్లు ప్రతిపాదించారు.ఇందులో సగం కూడా ఖర్చు చేయలేదు 2025-26 బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్‌కు 16 శాతం నిధులను కేటాయించడంతో పాటు ప్రస్తుత ఏడాది ఖర్చు చేయని నిధులను కూడా కలపాలి.ఎస్టీలకు రూ.17,056 కోట్లు ప్రతిపాదించారు.గిరిజనులు పది శాతానికిపైగా ఉన్నారు.జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు ఉండాలి.ఇప్పుడు ఖర్చు చేయని నిధులను కూడా కలపాలి.మైనార్టీల సంక్షేమానికి రూ.3,002 కోట్లు కేటాయించారు.రాష్ట్రంలో 12 శాతానికిపైగా జనాభా ఉన్నది.విద్యలో వెనుకబడి ఉన్నారు. మైనార్టీలకు నిధులను పెంచాలి.బీసీలు జనాభాలో సగానికిపైగా ఉన్నారు.వృత్తులు దెబ్బతింటున్నాయి.వారి సంక్షేమానికి అవసరమైన నిధులను కేటాయించాలి. ఎస్సీ,ఎస్టీలకు వసతితో కూడిన సివిల్ సర్వీసెస్ కోచింగ్ కేంద్రాలు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్నాయి.బీసీలకు వసతి లేకుండా కోచింగ్ కేంద్రాలున్నాయి. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు అన్ని జిల్లాల్లో వసతితో కూడిన కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పిస్తూ బడ్జెట్ కేటాయింపులుండాలి.'మాటల్లో కాదు..చేతల్లో చూపండి'అవసరమైతే ఢిల్లీలో దర్నా చేస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.మాటల్లో కాదు ఆచరణలో చూపెట్టాలి.బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను మతోన్మాద రాజకీయాలను కాంగ్రెస్,బీఆర్ఎస్ విమర్శిస్తూ ప్రకటనల వరకే పరిమితం చేస్తున్నాయి.ప్రజల్లోకి తీసుకెళ్లి వాటి ప్రమాదం గురించి చెప్పి చైతన్యం చేయడం లేదు.లౌకిక భావాలు కలిగిన ప్రజలను తయారు చేయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరి సరిగ్గా లేదు.బీఆర్ఎస్ వైఖరి ఫలితంగానే బీజేపీ ఎంపీ సీట్లు పెరిగాయి.రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలిచింది.బీజేపీ రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది.బడ్జెట్‌లో అదనపు నిధులు కేటాయించలేదు.వాటా ప్రకారం ఇవ్వాల్సిన నిధుల్లో కోత విధించింది.కేంద్రం తీరుపై పోరాడాలి.రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టాలి.కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి కేరళ,కర్నాటక,తమిళనాడు ముఖ్యమంత్రులు ఢిల్లీలో పోరాడుతున్నారు.తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా అఖిలపక్షం నిర్వహించాలి.నిర్దిష్టమైన ప్రతిపాదనలతో కేంద్రంపై ఒత్తిడి పెంచాలి.ఢిల్లీలో ఆందోళన చేపట్టాలి.'

## విద్యారంగానికి 20 శాతం కేటాయించాలి..

'విద్యారంగానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతున్నది.వసతులు సరిగ్గా లేవు.గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలు కూడా పిల్లలను ప్రయివేటు బడులకు పంపిస్తున్నాయి.అరకొర ఆదాయంలోనే అప్పులు చేసి ప్రయివేటులో చదివిస్తున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు వేల కోట్ల రూపాయల దోపిడీ చేస్తున్నాయి.రాష్ట్రంలో ఏటా రూ.30 వేల కోట్లకుపైగా వ్యాపారం జరుగుతున్నది.దీన్ని ప్రభుత్వం అరికట్టాలి.విద్యారంగాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించేలా చర్యలు చేపట్టాలి.ప్రస్తుత ఏడాదిలో విద్యకు రూ.21,621 కోట్లు కేటాయించింది.వచ్చే బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలి.ప్రభుత్వ పాఠశాలలు,కాలేజీలు,విశ్వ విద్యాలయాలకు సౌకర్యాలు,నిధులను పెంచాలి.నాణ్యమైన విద్యనందించాలి.లేకుంటే వారు వెనుకబడిపోతారు.పీజీ చేసినా ఉపాధి కూలీలు,సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు.ఈ దుస్థితి నుంచి మెరుగుపడాలంటే విద్యా ప్రమాణాలను పెంచాలి నిధుల కేటాయింపును పెంచాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని మెరుగుపర్చేలా కేటాయింపులుండాలి.వైద్య రంగానికి సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రులకు ఎక్కువ మంది పేదలే వస్తున్నారు.దీనికి కూడా నిధుల కేటాయింపు నామమాత్రంగా ఉంటున్నది.వైద్య రంగానికి రూ.10,996 (3.77 శాతం) కోట్లు కేటాయించింది. కనీసం పది శాతం నిధులను కేటాయించాలి.గ్రామీణ,మండల కేంద్రాల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపర్చాలి.పెద్ద గ్రామాల్లో హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయాలి.పీహెచ్‌సీలను బలోపేతం చేయాలి.'

## దూషణలు కాదు..సమస్యలపై చర్చించాలి

'పార్లమెంటు,అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదు.ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబడితే సస్పెండ్ చేస్తున్నారు.రాష్ట్రంలో కూడా ప్రజా సమస్యలపై చర్చ కంటే వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తున్నారో చెప్పకుండా గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడుతున్నారు.వ్యక్తిగత దూషణలతో,చర్చను పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారు.ప్రజల్లో దీని పట్ల వ్యతిరేకత వస్తున్నది.అసెంబ్లీ సమావేశాలంటే తిట్టుకోవడం తప్ప ప్రజా సమస్యలు చర్చకు రావంటూ ప్రజలు భావిస్తున్నారు.బడ్జెట్ ప్రతిపాదనలు నిర్దిష్టంగా ఉండాలి.ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా చర్చిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.ప్రభుత్వం వైపు నుంచి రాష్ట్రాభివృద్ధి,పేదలకు ఉపయోగపడేలా కేటాయింపులుండాలి.సమస్యల మీద చర్చ జరగాలి.'అని జాన్‌వెస్లీ సూచించారు.

---

# 'ఆర్ఆర్ఆర్' గురించి కీలక అప్డేట్ ఇచ్చిన కోమటిరెడ్డి

- రెండు నెలల్లో ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభించేందుకు గడ్కరీ హామీ ఇచ్చారన్న కోమటిరెడ్డి
- మూడున్నర నుంచి నాలుగేళ్లలో పనులు పూర్తి చేస్తామని వెల్లడి
- ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని వ్యాఖ్య

హైదరాబాద్ చుట్టూ నిర్మించనున్న ఆర్ఆర్ఆర్ (రీజనల్ రింగ్ రోడ్డు) గురించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో చర్చలు జరిపానని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ... ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్ మెంట్ పూర్తి చేసి పంపుతామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని అన్నారు.రెండు నెలల్లో పనులు ప్రారంభించేందుకు గడ్కరీ హామీ ఇచ్చారని కోమటిరెడ్డి తెలిపారు. మూడున్నర నుంచి నాలుగేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్ఆర్ఆర్ గురించి గడ్కరీని ఏడుసార్లు కలిశానని తెలిపారు. బీఆర్ఎస్ నేతల మాదిరి రోడ్లను అమ్ముకునే అలవాటు తమకు లేదని చెప్పారు.

# బెట్టింగ్ ఊబిలో యువత: అప్రమత్తంగా ఉండాలంటున్న సీనియర్ ఐపీఎస్ సజ్జనార్

బెట్టింగ్... ఈ పేరు వింటేనే ఎంతోమంది జీవితాలు ఛిద్రమైన ఉదంతాలు గుర్తుకు వస్తాయి. క్షణికావేశంలో, సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో ఈ వ్యసనంలో కూరుకుపోయి, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు ఎన్నో. ముఖ్యంగా యువత దీని బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించే యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు సైతం కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనిపై స్పందించిన సజ్జనార్, బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వల్ల అమాయక ప్రజల ప్రాణాలు తీయొద్దని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కొందరు వినిపించుకోకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా చేశారు."చాలామంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. దీనివల్ల సులువుగా డబ్బు సంపాదించవచ్చని అనుకుంటున్నారు. గత కొద్ది నెలలుగా నేను ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బెట్టింగ్ యాప్‌లపై పోస్టులు పెడుతున్నాను. వైజాగ్ సీపీ గారు కూడా ఒక సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ మీద కేసు పెట్టారు. ఎవరూ చట్టానికి అతీతులు కారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు. దీనివల్ల మీకున్న ఫాలోయింగ్ తగ్గిపోతుంది. కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. మీ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. బెట్టింగ్ యాప్‌లే కాదు, ఏ చట్టవిరుద్ధమైన, అనైతిక వ్యాపారాలను ప్రోత్సహించవద్దు" అని సజ్జనార్ హెచ్చరించారు.అప్పులు చేసి బెట్టింగ్‌లలో పాల్గొని, ఆపై వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి గురించి ఆయన ప్రస్తావించారు. యువత బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల మాటలను నమ్మవద్దని కోరారు. ఎవరైనా నష్టపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధించేందుకు చట్టం తీసుకువస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బెట్టింగ్‌లు నిషేధించబడ్డాయి, కానీ ఇప్పుడు అంతా ఆన్‌లైన్‌లో జరుగుతోంది కాబట్టి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని మోసాలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. చైన్ సిస్టమ్, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్, ఓటీపీ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ వంటి మోసాల గురించి ఆయన గుర్తు చేశారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా వీటిని అరికట్టవచ్చని అన్నారు.ప్రస్తుతం మార్కెట్లో వేలాది బెట్టింగ్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రోత్సహించే యూట్యూబర్లను, ప్రచారకర్తలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. క్రికెటర్లు, సినీ స్టార్లు, టీవీ సీరియల్ నటులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు డబ్బు కోసం ఇలాంటి వాటిని ప్రోత్సహించకూడదని ఆయన అన్నారు. కష్టపడి పనిచేస్తేనే డబ్బు వస్తుందని, షార్ట్‌కట్ మార్గాల్లో డబ్బును ఆశిస్తే నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే యూట్యూబర్లను బహిష్కరించాలని పిలుపునివ్వడంతో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని సజ్జనార్ తెలిపారు. "సే నో టు బెట్టింగ్ యాప్స్" అనే ఉద్యమం ఊపందుకుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**- తెలంగాణ ఉద్యమ కారుడు, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్**

కోదాడ ప్రతినిధి, మార్చి 18 (టుడే) : కొలువులు ఇవ్వడానికి చాతగాని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి, యువజన సంఘాలను అక్రమంగా అరెస్టులు చేసి అడ్డుకుంటుందని బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్ అన్నారు. మంగళవారం కోదాడలో టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం విద్యార్థుల నాయకులను అరెస్టు చేయడం ఇది అప్రజా స్వామికం, నిరంకుశ పాలనకు, ప్రభుత్వ, పాలకుల చేతగాని తనానికి నిదర్శనం అని ఆయన అన్నారు. అక్రమ అరెస్టులను, ప్రభుత్వ మరియు పాలకుల వైఖరిని, ఖండిస్తున్నాము అన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా, ఉద్యోగాలు భర్త చేయకుండా కాలయాపన చేస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని తెలిపారు. అక్రమ అరెస్టుతో, ఉద్యమాన్ని ఆపలేరని తెలిపారు. అరెస్ట్ ఐన వారి లో ఆసిఫ్, నసీర్, రాహుల్, వంశీ, ప్రభు, హేమంత్ గాని తదితరులు ఉన్నారు.



# కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఏజీపీ



సూర్యాపేట ,మార్చి 18(టుడే ప్రతినిధి)సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జ్, జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులలో నూతన ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ) గా నియమితులైన ఎండి షఫీ ఉల్లా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, మరియు మ్యాజిస్ట్రేట్ తేజస్ నందాలాల్ పవార్ గారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పూలబోకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మ్యాజిస్ట్రేట్ తేజస్ నందాలాల్ పవార్ మాట్లాడుతూ కోర్టులో సివిల్ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వానికి కక్ష దారులకు మధ్యవర్తిగా ఉంటూ భూ సమస్యలు పరిష్కారంలో చొరవ చూపాలని తెలిపారు. కలెక్టర్ కలిసిన వారిలో సూర్యాపేట బార్ అసోసియేషన్ కార్యదర్శి డప్పుకు మల్లయ్య, సీనియర్ న్యాయవాది సీనేపల్లి సోమేశ్వర్, జూనియర్ న్యాయవాది పల్లా పరమేష్ లు ఉన్నారు.

# మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరావుపై చర్యలు తీసుకోవాలి



**- న్యాయవాది కమతం నాగార్జున**

హుజూర్ నగర్,:మేళ్లచెరువు రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 876లో10 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలతో సేల్ డీడ్ నిర్వహించిన మైహోమ్ సిమెంట్స్ చైర్మన్ జూపల్లి రామేశ్వరావు, ప్రభుత్వ భూమి రిజిస్టర్ కు సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాది కమతం నాగార్జున హుజూర్నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్రభుత్వ భూమిని ఏ విధంగా ఫోర్జరి పత్రాలతో రిజిస్ట్రేషన్ నిర్వహించారు..?ఆ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాల వివరాలు, గ్రామపంచాయతీ పన్ను ఎగవేతపై ఆధారాలతో లిఖితపూర్వకంగా వినతి పత్రం ఆర్డీవోకు అందజేశారు.అనంతరం న్యాయవాది కమతం నాగార్జున మాట్లాడుతూ మైహోమ్ సిమెంట్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు బంధువు రౌతు భుజంగరావు పేరిట మేళ్లచెరువు రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 876 లో గల 10ఎకరాల ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలు సృష్టించారని ఆరోపించారు.ఈ సర్వే నెంబర్లు మొత్తం 446 ఎకరాల ప్రభుత్వ బంచారాయి భూమి ఉండగా, 10 ఎకరాల ప్రభుత్వ భూమి హైదరాబాద్ కు చెందిన రౌతుభుజంగరావు అనే వ్యక్తి మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వరావుకు విక్రయించినట్లుగా రెవిన్యూ, సబ్ రిజిస్టర్ అధికారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వ భూమికి సెల్ డిడ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.అనంతరం సేల్ డిడ్ నిర్వహించిన ప్రభుత్వ భూమిని లావుని పట్టాగా మైహోమ్ సిమెంట్స్ పేరిట రెవిన్యూ రికార్డులు,పహానిల్లో అధికారులు నమోదు చేశారు. ఎటువంటి క్రయవిక్రయాలకు అవకాశం లేని, నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలు సృష్టించి అట్టి భూమిని కబ్జా చేసి మైహోమ్ సిమెంట్ పరిశ్రమ ప్రధాన గేటు నిర్మించారని, అట్టి అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఫిర్యాదు దారుడు పేర్కొన్నాడు.10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా, అక్రమ నిర్మాణాలు చేపట్టి గ్రామపంచాయతీకి పన్ను కూడా చెల్లించడం లేదని న్యాయవాది నాగార్జున ఆరోపించారు. ప్రస్తుతం ఈ పది ఎకరాలకు దక్షిణ హద్దుగా ఉన్న డొంకదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, అట్టి అక్రమ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమికి సేల్ డీడ్ నిర్వహించిన మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు సహా మరో 6 మందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైహోమ్ సిమెంట్స్ యాజమాన్యం నుండి 10 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆయన ఆర్డిఓను కోరారు.

# ధాన్యం కొనుగోళ్ళలో మిలర్ల దోపిడీ నుండి రైతాంగాన్ని కాపాడాలి



కోదాడ ప్రతినిధి, మార్చి 18 (టుడే) : వరి కోతలు మొదలయ్యాయని, తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మిలర్ల దోపిడీ నుండి రైతాంగాన్ని కాపాడాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం కోదాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ సూర్యనారాయణకు రైస్ మిలర్లు, కమీషన్ ఏజెంట్లు మద్దతు ధర చెల్లించకుండా తరుగు పేరుతో తూకాన్ని తగ్గిస్తూ రైతాంగాన్ని దోపిడీ చేస్తున్న తీరును వివరించారు. ఈ దోపిడీని అరికట్టాలంటే తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓకు వినతి పత్రాన్ని అందజేశారు. అఖిలపక్ష రైతు సంఘాల ప్రతినిధుల సమక్షంలో రైస్ మిలర్స్ అసోసియేషన్, కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులతో ఆర్డీవో ఒక సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని, పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించాలని కోరారు. అలా చేయని పక్షంలో మిలర్ల దోపిడీకి గురై అమాయక రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పీఎం శ్రీ బాయ్స్ హై స్కూల్ లో వీడ్కోలు కార్యక్రమం..





కోదాడ ప్రతినిధి, మార్చి 16 (టుడే) : పట్టణంలోని పీఎం శ్రీ బాయ్స్ హై స్కూల్ నందు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కోదాడ మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి. సలీం షరీఫ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఉపాధ్యాయుల సూచనలు పాటించి, జాగ్రత్తగా పరీక్షలు రాసి వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుల మార్గదర్శక సందేశాలు, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు భావోద్వేగాల ఆవేదనలు, మోడ్రన్ డాన్సులు, సాంప్రదాయక నృత్యాలు, ఫోక్ డాన్సులు, ప్రత్యేకంగా ఏక్ బారత్– శ్రేష్టభారత్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ, హర్యానా రాష్ట్రాల సాంప్రదాయక నృత్యాలు, భాష సంభాషణ లు, వంటలు ప్రదర్శన విద్యార్థులను ఉపాధ్యాయులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఐ శివశంకర్ కు ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ఘన సన్మానం..





కోదాడ ప్రతినిధి, మార్చి 18 (టుడే) : కోదాడ పట్టణంలో వేంచేసియున్న శ్రీరంగాపురం ఆంజనేయస్వామి దేవాలయ పాలకవర్గం కోదాడ పట్టణ నూతన సిఐ ని ఘనంగా సన్మానించారు. మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పట్టణ సీఐ శివశంకర్ ను ఆలయ పాలకవర్గ సభ్యులు పట్టు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షులు ఎర్నేని వెంకటరత్నం బాబు, ఆలయ కమిటీ చైర్మన్ కుర్రి గోపులు మాట్లాడుతూ పట్టణంలో శాంతియుత వాతావరణంలో ప్రజల జీవన ప్రమాణాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, ఆంజనేయ స్వామి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో సాగాలని మనస్ఫూర్తిగా కోరారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శివశంకర్ మాట్లాడుతూ భగవంతుని కృపతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా పాడి పంటలతో తులతూగాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, ప్రమాద రహిత పట్టణంగా కోదాడని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తుల సంచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వంగవీటి శ్రీనివాస్, వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, పెదనాటి నరసింహారావు, రావెళ్ల కృష్ణారావు, లైటింగ్ ప్రసాద్, వేమూరు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పునర్విభజన రహస్యం?

ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నట్టు నియోజక వర్గాల తగ్గింపు అనేది ఊహాజనితమైన ప్రశ్న కాదు. పినరయి విజయన్ దీనిపై స్పష్టమైన ప్రకటనే చేశారు. గతంలో చాలా సార్లు చెప్పుకున్నట్టు జాతీయ విధానంలో భాగంగా జనాభా తగ్గింపు కృషిలో జయప్రదమైన దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గించడం కన్నా పొరబాటుండదు. అదే సమయంలో బీహార్, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు జనాభా విపరీతంగా పెరుగుతున్నా అదుపు చేయనందుకు సత్కరించినట్టు సీట్లు పెంచడమూ తప్పే అవుతుంది. చంద్రబాబు, స్టాలిన్ కూడా ఏ అధ్యయనం లేకుండా చెబుతున్నట్టు జనాభా పెంచేయమని పిలుపివ్వడమూ కాదు. కేంద్ర విధానం రాజ్యాంగబద్ధంగా శాస్త్రీయంగా వుండాలని పినరయి తన ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రతి రాష్ట్రానికీ ఇప్పుడున్న సీట్ల శాతం తగ్గకూడదు. జనాభా తగ్గించినందుకు సీట్ల తగ్గింపు శిక్ష కాకూడదు. 1952, 1963, 1973లో అంటే ప్రతి దశాబ్దికి ఒకసారి జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణతో దాన్ని నిలిపేసి 2001 తర్వాత మళ్లీ చేపట్టాలని నిర్ణయించారు. ఈలోగా జనాభా నియంత్రణను ప్రోత్సహించి వివిధ రాష్ట్రాల మధ్య జనాభా అసమానతలు తగ్గించాలనేది ఇక్కడ ఉద్దేశం. 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం దీన్ని 2031 వరకూ నిలిపేశారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ చర్చ ముందుకు తెచ్చిన కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు జనాభా నిష్పత్తి ప్రకారమే సీట్లు వుంటాయి గానీ తగ్గబోవని మాట్లాడుతున్నది. అయితే ఇక్కడ సమస్య ఏమిటో పినరయి సూటిగానే లేవనెత్తారు. సీట్ల నిష్పత్తిని కాపాడతారా లేక జనాభా నిష్పత్తిని కాపాడతారా? ఇందులో ఏది పాటించినా సీట్లు తగ్గుతాయని తేల్చిచెప్పారు. గతంలో 1952లో అప్పటి దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా లోక్‌సభలో 25.35 శాతం వుంటే 1967 నాటికి అది 24.13 శాతానికి తగ్గింది. 1977లో వున్నవాటిని స్తంభింపచేసేనాటికి ఈ వాటా 23.85 శాతానికి దిగజారింది. మామూలుగానే ఇంత తగ్గుదల కనిపిస్తుంటే ఇప్పుడు పెద్ద ఎత్తున జరిగిన జనాభా తగ్గింపు తర్వాత ఇది మరీ కోత పడటం అనివార్యం. కనుకనే పినరయి వంటి వారు ముందు మీ పునర్విభజన ప్రాతిపదిక ఏంటో చెప్పి సీట్ల విషయంలో న్యాయం జరిగేలా హామీ కల్పించి తర్వాతే అడుగు ముందుకేయాలంటున్నారు. ఇదేదో సీట్లు, పార్టీల సమస్యగా చూస్తే పొరబాటు. దేశవ్యాపిత విధానాలు రూపొందించే పార్లమెంటులో రాష్ట్రాలకు అందులోనూ పెద్ద భాగంగా వున్న మొత్తం దక్షిణాదికి తగు ప్రాతినిధ్యం లేకపోతే నష్టం కలుగుతుంది. దేశ సమైక్యతా భావనా దెబ్బ తింటుంది. శుష్క నినాదాలతో అధీకృత దేశభక్తి భంగిమలతో తేలేది కాదు. నిజమైన సమాఖ్య భావనతో రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామిక అవగాహనకు రావాల్సి వుంటుంది. ప్రతి జనాభా లెక్కల తర్వాత పార్లమెంటు నిర్ణయం మేరకు రాష్ట్రపతి ఆదేశాలతో నియోజక వర్గాల పునర్విభజన జరగాలని మాత్రమే రాజ్యాంగం చెబుతున్నది. ఇప్పుడు జనాభా తగ్గించిన రాష్ట్రాలకు నష్టం జరగకూడదంటే ఆ మేరకు నిర్దిష్టమైన కొత్త కొలబద్దలు కావాలి. వాటిపై రాష్ట్రాలతో వివరమైన చర్చ జరగాలి. అవేవీ లేకుండానే అమిత్ షా తో సహా కేంద్ర పెద్దలు ఏకపక్షంగా మాట్లాడటం సందేహాలు పెంచుతున్నది. కేంద్రం ఏకపక్ష నిర్ణయాల నేపథ్యం, దక్షిణాన బిజెపి బలం బాగా తక్కువ కావడం, ఈ సందేహాలను తీవ్రం చేస్తుంది. జనాభా ప్రాతిపదికను ఆధారం చేసుకుని వాదిస్తున్న బిజెపి 2021 నాటికి పూర్తికావలసిన జనభా లెక్కల సేకరణ ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేయడం కూడా సందేహాలను పెంచుతోంది. కేంద్రం ఏకపక్షంగా తీసుకొచ్చిన నూతన విద్యా విధానం కూడా దక్షిణ, తూర్పు రాష్ట్రాలలో హిందీ బలవంతాన రుద్దుతున్నారనే నిరసనకు దారితీసింది. తూర్పు రాష్ట్రాలలోనూ ఈ భావన వుంది. కేంద్రం ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ పార్లమెంటు ప్రశ్నోత్తరాల్లోనూ కూడా హిందీనే పెంచడంపై ఎంపీలు నిరసన తెలియజేశారు. కేరళ సిపిఎం ఎంపి జాన్ బ్రిటాస్ దీనిపై సుదీర్ఘ లేఖ రాశారు. హిందీ భారతీయ ఆత్మ అని స్వయంగా అమిత్ షా ప్రకటించారు. తమిళనాడులో సంప్రదాయికంగా హిందీ సమస్యపై భావోద్వేగాలు ఎక్కువ గనక ఆ పేరే వినిపిస్తుంది గానీ సమస్య నిజమైందే. నూతన విద్యా విధానం త్రిభాషా సూత్రాన్ని మళ్లీ ముందుకు తెచ్చింది. ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలని చెప్పడం గాక స్థానిక భాష లేదా ప్రాంతీయ భాష ఏదో ఒకదాంట్లో జరగాలని, మరో భారతీయ భాష కూడా నేర్పాలనీ ఆ విధానం చెబుతున్నది. ఇది అశాస్త్రీయమే గాక ఆ లేత వయసుకు భారం కూడా. ఇప్పటికే ఇంగ్లీషు మీడియంతో చదువులు మొదలవుతున్న స్థితిలో ప్రాంతీయ భాష, భారతీయ భాష అనడం హిందీ లేదా సంస్కృతం తెచ్చిపెట్టడానికే దారితీస్తుందనేది అనుభవం. హిందీ రాష్ట్రాలలో ఆ భాష నేర్చుకుంటే సరిపోతుంది గాని ఇతర చోట్ల మరో భారతీయ భాష కింద హిందీనే నేర్పడం కద్దు. కేంద్రం నిధులు యంత్రాంగం, పథకాలు అన్నీ ఆ దిశలోనే వున్నాయి తప్ప ఇతర భాషల కోసం ఎలాంటి ఏర్పాటు లేదు. ఇంగ్లీషుతో పాటు తమిళం ఎలాగూ నేర్చుకుంటున్నప్పుడు హిందీని తప్పనిసరి చేయడమేమిటని తమిళనాడులో గత వందేళ్లుగా ఆందోళనలు జరుగు తున్నాయి. ఈ నేపథ్యం చూడకుండా త్రిభాషా విధానం అమలు చేయకపోతే కేంద్ర విద్యా నిధులు నిలిపేస్తామని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వంటి వారు నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామికం. బాధ్యతా రహితం. ఈ బలవంతపు శాసనాలు ఆపకుండా తమిళులు హిందీ వ్యతిరేకులన్నట్టు వారిపై అభాండాలు వేయడం అనుచితం. అంతటితో ఆగక పవన్ తెలుగువారిని తమిళులు అవమానిస్తారని చెబుతున్నారు. మద్రాసీలుగా పిలవబడే తెలుగువారి ఆత్మగౌరవం ఎన్టీఆర్ వల్లనే నిలబడిందని

PRINTED AND PUBLISHED BY BADE RAMARAO, ONBEHALF OF HANSINI PUBLICATION, PRINTED AT HANSINI PRINTERS, H.NO.3-119/A, CHUERVUKALVERTU PRAKKABAZARNUNDI, ANANTHAGIRI ROAD, KODAD, DIST-NALGONDA-508206. EDITOR: BADE.RAMARAO. CELL: 9948132341. RNI NO:125624/2013 E-MAIL: HANSINITO-DAY@GMAIL.COM, https://www.todaytelugudaily.in/